క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో చైత్ర పౌర్ణమి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని పీఠంలోని విజయదుర్గా అమ్మవారిని పలు రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారితో పాటు విజయవేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చన, భవానీ సమేత అష్టమ లింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఆర్వో బాబి ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

రాయవరం: గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరారు. మండలంలోని మాచవరంలో శనివారం బీజేపీ నేతలు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకిరాంబాబు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరాల రాంబాబు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వరి కోతలు జోరుగా సాగుతున్న తరుణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడం వలన దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఈర్లెల్ల కృష్ణమూర్తి, శాకా ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవార్ల జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న గ్రామ దేవతలు కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. పట్టణంలోని వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ మార్కెట్లో కొలువైన అమ్మవార్ల ఉత్సవాలు రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. బాలారిష్టాలు ఉన్నవారు అమ్మవారిని దర్శించుకుంటే తొలగిపోతాయని ప్రతీతి. పట్టణం నలుమూలల నుంచి వందలాది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో కామేశ్వరరావు ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవార్లను డప్పు వాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. గరగ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేపీ రోడ్డులో జరిగిన తీర్థంలో భక్తులు సందడి చేశారు.

కనక మహాలక్ష్మి ఎల్లారమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలకు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి హాజరయ్యారు. కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు చైర్‌పర్సన్, కౌన్సిలర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎర్నేని ప్రభావతి, మందపల్లి రవికుమార్, గ్రంధి శ్రీనివాస్, వైఎస్సార్ నాయకులు లేగా వెంకన్న, దుగ్గిరాల గనేశ్, కమిటీ చైర్మన్ శ్రీనివాస్, లేగా బంగారం, దుగ్గిరాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి

కాజులూరు: పచ్చి రొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని డెల్టాలోని పంట భూముల్లో రైతులు రబీ సాగు అనంతరం మూడో పంటగా పచ్చి రొట్ట ఎరువుల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు. శనివారం కాజులూరులో ఆయన రైతులతో మాట్లాడుతూ డెల్టాలో కొందరు రైతులు దాళ్వా సాగు అనంతరం అపరాల సాగు చేపట్టగా కొందరు రైతులు దాళ్వా మాసూళ్లు ఆలస్యం కావడంతో పొలాలను ఖాళీగానే వదిలి వేస్తున్నారన్నారు. అయితే పెసర, మినుము వంటి అపరాల సాగుకు అవకాశం లేని పొలాల్లో రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చి రొట్ట ఎరువుల సాగు చేపడితే భూసారం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు వలన రైజోబ్యూమ్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది భూసారం పెరుగుతుందని పచ్చిరొట్ట మొక్క వేళ్ల నుంచి నత్రజని భూమిలో చేరుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా పోషకాలతో కూడిన ఎరువును పొలానికి అందించి తదుపరి వరి సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

ఆక్వా జోన్ మాకొద్దు

- ముక్తకంఠంతో వ్యతిరేకించిన రైతులు
- గ్రామ సభల్లో తీర్మానాలు
- మూడు పంటలు పండే భూములను నాశనం చేయబోమని వెల్లడి
- ఇప్పటికే సంక్షోభంలో ఆక్వా రైతులు



అంగర గ్రామ సభలో ఆక్వా జోన్‌పై మాట్లాడుతున్న మత్స్యశాఖ ఎఫ్‌డీఓ దేవీరాజు (ఫైల్)

కపిలేశ్వరపురం: ప్రభుత్వం ఏదైనా చేయదలిస్తే అది ప్రజలకు మేలు చేసేదై ఉండాలి. అధికారులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం తరఫున ఏదైనా తీర్మానం చేయమని అడిగితే ప్రజలు అంగీకరించే తీరులో పాలన ఉండాలి. కాగా ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను బహిరంగంగానే ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం మత్యశాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత గ్రామాల్లో సభలను నిర్వహించింది. నిర్దేశించిన వరిసాగు పొలాలను ఆక్వా జోన్‌గా ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిందని, ఆసక్తి కనబరిస్తే ఆక్వాజోన్ ఏర్పాటు చేస్తామంటూ మత్యశాఖ అధికారులు రైతులు, ప్రజలను కోరారు. దానిని ప్రజలు ముక్తకంఠంతో వ్యకిరేకించారు. ఆక్వా జోన్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తీర్మాణాలు చేశారు. ఇప్పటికే ఆక్వా రైతులు సంక్షోభంలో ఉన్నారని, వారికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలంటూ రైతులు సూచనలు చేశారు.

ఆక్వా జోన్ ప్రతిపాదనలిలా....

కపిలేశ్వరపురం మండలంలోని 9 గ్రామాల్లో 2,284.162 ఎకరాలను ఆక్వా సాగుకు అనుకూలంగా ఉందంటూ ప్రతిపాదించినట్టు గ్రామ సభల్లో మత్సశాఖ అధికారులు తెలిపారు. వాకతిప్పలో 34.265 ఎకరాలు, టేకిలో 756.54 ఎకరాలు, అంగరలో 252.119, వెదురుమూడిలో 142.79, వడ్లమూరు 64.49, వల్లూరులో 111.638, కాలేరులో 653.874, నల్లూరులో 264.536, కపిలేశ్వరపురంలో 264.536 ఎకరాలు ఆక్వా జోన్‌లో ప్రతిపాదించారు. ఈ ఏడాది మార్చి 28న మండల పరిషత్ సర్వసభ్య బడ్జెట్ సమావేశంలో ఆక్వా జోన్ వద్దంటూ జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు నిర్ణయం తీసుకొన్నారు. ఈ నెల 3న అంగర పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో రైతులు తమకు ఆక్వా జోన్ వద్దంటూ తీర్మానం చేశారు. మండలంలోని 9 గ్రామాల్లో వరి పంట భూములను ఆక్వాసాగుకు ప్రతిపాదించడాన్ని స్థానిక వరి సాగు రైతులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి అమలాపురం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఆ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు.

వ్యతిరేకించడానికి కారణాలు

ఆక్వాజోన్ ఏర్పాటైతే వరిసాగు పొలాలను ఆక్వా చెరువులుగా మార్చుకొనే అనుమతులు సులభంగా వస్తాయని గ్రామ సభల్లో మత్యశాఖ అధికారులు రైతులకు చెప్పారు. దానికి రైతులు ప్రతిస్పందిస్తూ ఆక్వా చెరువులు పదుల సంఖ్యలో ఎకరాలున్న వారు తవ్వగలరు గాని, అర ఎకరా, ఎకరా రైతులకు ఆ స్తోమత ఉండదంటూ స్పష్టం చేశారు. మూడు పంటలు పండే భూములను ఆక్వా చెరువులుగా మార్చాల్సిన అవసరం ఏమాత్రం ఉండదు. ఒకవేళ సాగు చేసినా చెరువులు సమీపాన గల వరి పంటలు దెబ్బతింటాయి. చెరువులున్న గ్రామాల్లో తాగునీరు కలుషితమైపోతోంది. భూగర్భ జలాలు అడుగంటిపోతాయన్న కారణాలతో ప్రజలు ఆక్వా జోన్‌ను వ్యతిరేకిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో కష్టాలు

రాష్ట్రంలో ఆక్వా సంక్షోభం పట్టి పీడిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆక్వాకు మహర్దశ పట్టిస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. 10 నెలల పాలనా కాలంలో ఆక్వా సంక్షోభంలో కూరుకుపోయింది. ఎగుమతుదారులు ఆక్వా రైతులకు అండగా ఉండాలని, 100 కౌంట్ రొయ్యలు కిలోకు రూ.220 ధర తక్కువ కాకుండా చెల్లించాలని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కానరావడం లేదు. ప్రస్తుతం జిల్లా 30 వేల ఎకరాల్లో ఆక్వా పంట సాగవుతుండగా మరో నెల రోజుల్లో పంట చేతి కొస్తుండగా సంక్షోభం ఆక్వా రైతును ఆందోళనలోకి దింపింది.

పంట భూములను నాశనం చేయడం సరికాదు

జిల్లాలో 8 మండలాల్లో 40 గ్రామాల పరిధిలో 94 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. 80 వేల మంది మత్యకారుల్లో 11,500 మంది వేట సాగిస్తుండగా సముద్ర జలాల్లో వేట సాగించే బోట్లు 1,930 ఉన్నాయి. వారికి న్యాయం చేసే కార్యాచరణపై దృష్టి సారించకుండా మూడు పంటలు పండే భూములను ఆక్వా జోన్‌గా చేస్తామంటూ కూటమి నేతలు చెప్పడాన్ని రైతులు తీవ్రంగా తిప్పికొడుతున్నారు. ఆక్వా జోన్ గ్రామ సభల్లో ఆమోదం తెలపడం ద్వారా ఆక్వా సాగు అనుమతులు సులభతరంగా వస్తాయని అధికారులు చెబుతుండగా వరి సాగు రైతులు మా పంట భూములను పాడు చేయొద్దని బహిరంగంగానే చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆక్వాజోన్ పట్ల ప్రజలు, రైతుల్లో ఉన్న ఆందోళనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మూడు పంటలు పండే భూములను దెబ్బతీసే పనిని తాము చేయలేమని చిన్న రైతులు స్పష్టం చేస్తున్నారు. మార్చి 28న నిర్వహించిన మండల సమావేశంతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో రైతులు అభిప్రాయానికి అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధులమంతా వ్యవహరించాం.

మేడిశెట్టి సత్యవేణి, ఎంపీపీ, కపిలేశ్వరపురం

విద్యార్థుల శిక్షణ సంతృప్తికరం



ద్రాక్షారామలో వృత్తి విద్యా విద్యార్థుల శిక్షణను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ రమేష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో వృత్తి విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు గత 10 రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ క్లాసులలో అందిస్తున్న శిక్షణ సంతృప్తికరంగా కొనసాగుతుందని జిల్లా వృత్తి విద్యా కోఆర్డినేటర్ కె.రమేష్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా జిల్లా పర్యవేక్షకుడు ఎస్‌బీకే భీమారావు సూచనల మేరకు ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు వారు ఎంచుకున్న రంగాల మేరకు వీఆర్ ఎంబ్రాయిడరీ వర్క్‌షాపు, ప్రసాద్ కంప్యూటర్ సర్వీసెస్ కేంద్రాల్లో సాంకేతిక శిక్షణ పొందుతున్న వివరాలను పరిశీలించామన్నారు. శిక్షణ సజావుగానే సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, పాఠశాల వృత్తి విద్యా ఉపాధ్యాయులు రాజశేఖర్, కళ్యాణి, ఉపాధ్యాయులు పి.మెహర్ సుజాత, వాడ్రేవు భానుగాయత్రి పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి తీర్థం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థం శనివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు అమ్మవారి పూజా ఘటాలకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

క్రమశిక్షణతో కూడిన నైపుణ్యాలు అభ్యసించాలి



సర్టిఫికెట్లు అందుకున్న శిక్షణ తీసుకున్న విద్యార్థులు తదితరులు

రామచంద్రపురం: విద్యాభ్యాసం అనంతరం మంచి ఉద్యోగ అర్హత సాధించేందుకు క్రమ శిక్షణతో కూడిన నైపుణ్యాలను అభ్యసించాలని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ అన్నారు. ఈనెల 7 నుంచి 12 వరకు కళాశాలలో జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ ద్వారా 'సాఫ్ట్ స్కిల్స్-ఎంప్లాయిబిలిటీ స్కిల్స్' పై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మహిళా డిగ్రీ విద్యార్థుల కోసం నిర్వహించారు. ఈ శిక్షణలో రెండో సంవత్సరం, ఆఖరి సంవత్సరం తరగతులకు చెందిన 54 మంది మహిళా విద్యార్థులు పాల్గొన్నారు. చైతన్య ఆధ్వర్యంలో విద్యార్థులకు యాక్టివిటీ బేస్డ్ క్లాసుల ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, సమయ నిర్వహణ, బృంద సహకారం, ఇంటర్వ్యూకు అవసరమైన నైపుణ్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగుపరచుకున్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు ఇలాంటి శిక్షణల ద్వారా తమ వ్యక్తిత్వ వికాసాన్ని సాధించగలరని, ఈ అవకాశాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ మాట్లాడుతూ శ్రమతో కూడిన క్రమశిక్షణతో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎండీ షహజాదీ బేగం మాట్లాడుతూ, ఈ తరహా శిక్షణలు విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి ఎంతో కీలకమని, పోటీ ప్రపంచంలో సాఫ్ట్ స్కిల్స్ ఉన్నవారికే మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. నైపుణ్యాలు విద్యార్థులను విద్యావంతుల నుండి ఉద్యోగయోగ్యులుగా తీర్చిదిద్దగలవని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కాగా బీఎస్సీ థర్డ్ ఈయర్ ఎం. లోహిత ప్రియా, సెకండ్ బీకాం షేక్ సుల్తానాలకు ప్రత్యేక ట్రోఫీలు అందజేశారు.

హసన్‌బాదలో ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు

రామచంద్రపురం రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న మండలంలోని హసన్‌బాదలో నిర్వహించనున్న గ్రామ సభలో ఉపన్యాస పోటీలు, అదే విధంగా హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు శనివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటలకు అంబేడ్కర గురించి 10 నిమిషాల సమయంలో ఉపన్యాసం ఇవ్వాలని ఉత్తమ ఉపన్యాసం ఇచ్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

ఈ ఉపన్యాస పోటీలలో ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

మా బడిలో చేర్పించండి !



లొల్లలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ నిమిత్తం ఇంటి బాట పట్టారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం లొల్లలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు లేనప్పటికీ, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా విద్యార్థుల కోసం ఇంటి బాట పట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలను వివరిస్తూ, విద్యార్థులను స్థానిక ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ఉపాధ్యాయులు వి.సాయన్న, టి.శ్రీనివాస్, బీపీ రామకృష్ణ, భద్రిరాజు శ్రీనివాస్, వీరాంజనేయ రెడ్డి, ఎన్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన విద్యా కుసుమాలు

- ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ
- ప్రగతి పథంలో పేదింటి పిల్లలు



అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు



ఉత్తమ ప్రతిభ కనబరిచిన బొడ్డు దివ్యను అభినందిస్తున్న అధ్యాపకులు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



కాజులూరులో దేవీహాసినిని అభినందిస్తున్న అధ్యాపకులు

కపిలేశ్వరపురం: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన పేదింటి పిల్లలు ఉత్తమ ఫలితాలను సాధించారు. అంగర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు ఆరుగురికి నలుగురు, సీఈసీలో ఐదుగురికి ఒకరు ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విద్యార్థిని శలా సాయి దుర్గ 470 కి 303 మార్కులు, సీఈసీ విద్యార్థిని రజితశ్రీ 500కి 290 మార్కులు సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎం అంగర రాజు, ఉపాధ్యాయులు డీటీఎస్ శ్రీనివాస్, ఎస్.రాఘవేంద్ర, అందే సత్యనారాయణ, ఎంటీఎస్ గణేష్ అభినందించారు. మాచర ప్లస్ టు కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ముగ్గురు, బైపీసీలో ఒకరు పరీక్షలు రాయగా నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఏడుగురికి నలుగురు, బైపీసీలో ఇద్దరికి ఇద్దరూ ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ ఎంపీసీ విద్యార్థిని గాడా ద్రాక్షవల్లి 1000కి 842 మార్కులు, బైపీసీ విద్యార్థిని నూపే కల్యాణి వెయ్యికి 788 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని కేవీ హర్షిణి 470కి 451 మార్కులు, బైపీసీలో నీలం వందన 440కి 282 మార్కులు సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాస్, ఎన్.వెంకట్, శివశ్రీను, శిరిడి సాయి, ఉదయ్ అభినందించారు. అంగరలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థిని, వల్లూరుకు చెందిన బొడ్డు దివ్య 1000కి 988, కపిలేశ్వరపురానికి చెందిన చిట్టూరి సంధ్య 981, పెదపల్లకు చెందిన గుత్తల మహేశ్వరి 981, పామర్రుకు చెందిన పెద్దిరెడ్డి బాలశ్రీ 980 మార్కులు సాధించారు. సెకండ్ బైపీసీలో చింతలూరుకు చెందిన ఇంటి మహాలక్ష్మి 982, పామర్రుకు చెందిన కడలి సౌమ్య 971, కురకాలపల్లికి చెందిన పలివెల భాను సుప్రియ 970 మార్కులు సాధించారు. సెకండ్ సీఈసీలో దుళ్లకు చెందిన మెర్ల నాగలక్ష్మి 956, అంగరకు చెందిన గొడితి అభినయ్ 943, నవాబుపేటకు చెందిన తిప్పా నాగలక్ష్మి 937 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470కి అంగరకు చెందిన కోట గౌతమి 459, పినపల్లకు చెందిన పిల్లా దీపిక 455, ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థిని 440కి నవాబుపేటకు చెందిన అంగర అంజలి 414 మార్కులు, పెద్దపల్లకు చెందిన ఇళ్ల శ్రీరమ్య 410, ప్రథమ సంవత్సరం సీఈసీలో 500కి నర్సిపూడికి చెందిన కట్టమూరి వాసవికి 446, దుళ్లకు చెందిన భావన మహాలక్ష్మి 444 మార్కులు సాధించారు.

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఇంటర్మీడియెట్ బోర్డు శనివారం విడుదల చేసిన ఫలితాల్లో ప్రథమ సంవత్సరం నిరాశాజనకంగానూ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆశాజనకంగానూ ఉన్నాయి. ఇంటర్ ఫస్టియర్‌లో 45 శాతం, సెకండియర్‌లో 83శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో ఎంపీసీ నుంచి 69 శాతం, బైపీసీ నుంచి 47 శాతం, సీఈసీ నుంచి 43 శాతం, హెచ్‌ఈసీ నుంచి 15 శాతం, సెకండియర్‌లో ఎంపీసీ గ్రూపు నుంచి 90 శాతం, సీఈసీ నుంచి 89 శాతం, హెచ్‌ఈసీ నుంచి 83 శాతం, బైపీసీ నుంచి 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు. ఎంపీసీలో ఎం.అమృతవర్షిణి 967 మార్కులు సాధించగా, బైపీసీలో ఎం.నందిని 871 మార్కులు, సీఈసీలో కె.చండీప్రియ 929 మార్కులు, హెచ్‌ఈసీలో పి.వెన్నెల 788 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో పి.శ్రీసాయిత్రివేణి 423, బైపీసీలో వి.నాగవెంకటరమణ 370, సీఈసీలో కె.స్రవంతి 412, హెచ్‌ఈసీలో ఎల్.హేమంత్ 397 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడి అత్యున్నత మార్కులు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, అధ్యాపకులను ప్రిన్సిపాల్ రామారావు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

కె.గంగవరం: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పామర్రు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పామర్రు గ్రామానికి చెందిన నున్న ఏబీడీ సాయి అంజలి ఎంపీసీ గ్రూపులో 952 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానం సాధించింది. కోటిపల్లి గ్రామానికి చెందిన ఎస్.బిందు మాధవి ఎంపీసీ గ్రూపులో 919 మార్కులు సాధించి కళాశాల ద్వితీయ స్థానం సాధించింది. యండగండి గ్రామానికి చెందిన జి.లక్ష్మీ మౌనిక బైపీసీ గ్రూపులో 867 మార్కులు సాధించి కళాశాల తృతీయ స్థానం సాధించింది. దీంతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో కూళ్ల గ్రామానికి చెందిన కనకాల ఆశిష్‌కుమార్ ఎంపీసీ గ్రూపులో 414 మార్కులు సాధించి మొదటి స్థానం సాధించగా కె.చిన్ని బైపీసీ గ్రూపులో 325 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 84 శాతం, మొదటి సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.


మండపేట: ఇంటర్ ఫలితాల్లో ఏడిద జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు మెరిశారు. శనివారం విడుదలైన పరీక్షల ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీ విద్యార్థిని కొమ్ము శైలజ 946 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచింది. ఫస్ట్ ఇయర్ బైపీసీ విద్యార్థిని పంతంగి రమ్యశ్రీ 433/440 మార్కులు సాధించింది. ఎంపీసీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు నూరు శాతం పాసవ్వగా సెకండియర్‌లో ఎంపీసీలో 80 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో 908 మార్కులతో కోసూరి శాలిని ద్వితీయ స్థానం సాధించింది. ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకట్రాజు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఫస్ట్ ఇయర్ బైపీసీ విద్యార్థిని మేడిద మేఘన 419 మార్కులతో ద్వితీయస్థానంలో నిలవగా, ఫస్ట్ ఇయర్ విద్యార్థిని పల్లాటి మహేశ్వరి 440కి గాను 398 మార్కులు సాధించింది. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

కాజులూరు కళాశాలలో 71 శాతం ఉతీర్ణత


కాజులూరు: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 71 శాతం ఉతీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు తమ కళాశాల నుంచి ఈ ఏడాది 93 మంది విద్యార్థులు హాజరు కాగా 66 మంది విద్యార్థులు విజయం సాధించారన్నారు. ఇందులో 976 మార్కులతో ఎంపీసీ విద్యార్థిని కాదా దేవీహాసిని నిలవడంతో పాటు కాకినాడ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. అదే విధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో తమ కళాశాల నుంచి 84 మంది పరీక్షకు హాజరుకాగా 42 మంది విజయం సాధించి 50 శాతం ఉతీర్ణత పొందారన్నారు. ద్వితీయ సంవత్సర ఫలితాలలో 964 మార్కులతో జక్కె దివ్యశ్రీదుర్గా కళాశాల ద్వితీయ స్థానంలోనూ, 953 మార్కులతో యాళ్ళ సత్యేశ్వర్ తృతీయ స్థానంలోనూ నిలిచారన్నారు.

రామచంద్రపురంలో..


రామచంద్రపురం: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చల్లా వెంకటేశ్ వెయ్యికి 982 మార్కులు సాధించాడు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జె.నిఖిల్ వర్మ 470కి గాను 459 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. కాగా సెకండ్ ఇంటర్‌లో చల్లా వెంకటేశ్‌కు 982 మార్కులతో మొదటిస్థానంలో ఉండగా బైపీసీలో పలివెల జ్ఞానా భిక్షి 941, సీఈసీలో మోర్త రామ్‌చరణ్‌తేజకు 850, హెచ్‌ఈసీలో కె.పార్వతికి 794 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఒకేషనల్ కోర్సుల్లో సీఎస్‌సీలో కట్టా శ్రీవీదుర్గదేవి 876, సీఈటీలో ఐనవిల్లి ప్రభావతి 914, ఈఈటీలో ఎండీఎన్‌డీ మాణిక్యలావణ్యకు 831, ఎంపీహెచ్ డబ్ల్యూలో ముప్పిడి దివ్యకు 965 మార్కులు వచ్చినట్లు తెలిపారు. కాగా ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీలో పాటి హారిక 357, సీఈసీలో ఎంపీ సత్యపావని 449, హెచ్‌ఈసీలో చంద్రకళ 435 మార్కులతో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా మొదటి ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో సీఎస్ఈలో మాటూరి బాల వెంకరట నాగజగదీష్ 492, సీఈటీలో కర్రి సందీప్‌రెడ్డి 437, ఈఈటీలో మునుకోటి నరేష్ 465, ఎంపీహెచ్‌డబ్ల్యూలో నేలపాటి ఇవాంజలిన్‌కు 489 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.




సాయిదుర్గ (303)




కె.వీరహర్షిణి (451)



ద్రాక్షవల్లి (842)



కొమ్ము శైలజ (946)



పి.రమ్యశ్రీ (433)



కోసూరి షాలిని(908)




మేడిద మేఘన (419)



పి.మహేశ్వరి(398)



చల్లా వెంకటేష్(982)



జె.నిఖిల్ వర్మ (459)